క్లుప్తంగా

అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్లం సబ్జెక్టును బోధించేందుకు అతిథి అధ్యాపకుడి పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్స్‌పాల్ డా. కె. మల్లేశం సూచించారు. ఎంఏ ఇంగ్లీష్‌లో 55 శాతం మార్కులు కలిగిన జనరల్, బీసీ అభ్యర్థులు, 50 శాతం మార్కులు కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. నెట్ లేదా సెట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు పత్రాలను కళాశాలలో అందజేయాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా అవార్డుకు ఎంపిక

కల్వకుర్తి రూరల్: స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో 10 సంవత్సరాలుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు నిర్వహించారు. వారి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం యువజన క్రీడా సర్వీసుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే నెహ్రూ యువ కేంద్రం స్వామి వివేకానంద సేవా బృందానికి ఉమ్మడి జిల్లా స్థాయి ఉత్తమ యువజన సంఘంగా ఎంపిక చేసింది. శనివారం సంఘం అధ్యక్షుడు శివ మాట్లాడారు. అవార్డు రావడంపై ఆనందంగా ఉందన్నారు.

కార్మికులందరికీ మోటార్ సైకిళ్లు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా కార్మిక శాఖమంత్రి ప్రకటించిన విధంగా భవన నిర్మాణ కార్మికులందరికీ సైకిల్ మోటార్లు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి అందజేశారు. పెండింగ్‌లోని 54 వేల నష్టపరిహారాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన వారికి ప్రమాద బీమా రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. దహన సంస్కారాల ఖర్చులు, వివాహ, ప్రసూతి కానుక రూ.30 వేల నుంచి రూ.లక్షకు పెంచాలని ఖాళీగా ఉన్న ఏఎల్‌ఓ, బీఎల్‌ఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, అశోక్, సత్యం, లక్ష్మినారాయణ, కేశవులు, శ్రీనివాస్, రఘు, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మధుమేహ పరీక్షలు

కల్వకుర్తి: పట్టణంలోని లయన్స్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో శుక్రవారం డయాబెటిస్ శిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారందరికి ఉచితంగా సంపత్‌కుమార్ పరీక్షలు నిర్వహించారు.

హరితహార ప్రేమికుడికి సన్మానం



పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్టకి చెందిన హరితహార ప్రేమికుడు వీఆర్‌ఏ రమేష్ నాయుడిని శుక్రవారం మంచాలకట్టలోని గోపులాపురం సంఘ సేవకుడు తాండూరు భాస్కర్‌రెడ్డి దంపతులు జయమ్మ ఘనంగా శాలువాతో సత్కరించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహార కార్యక్రమం చేపట్టిన మొక్కలను ఎంతో శ్రమతో కాపాడాలనే ఆశతో ఇతను దాదాపు 200 చెట్లను సొంతఖర్చుతో తోపుడు బండి పెట్టి ప్రత్యేకంగా బిందెలు, పైపులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి మొక్కలను పెంచారని చెప్పారు. 'సాక్షి' దినపత్రికలో ప్రచురించగా.. అదిచూసి నేను నా వంతు సాయం చేస్తున్నానని తెలియజేశారు. ఆయన్ను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భాస్కర్‌రెడ్డి, జయమ్మ, అశోక్ రెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.

తడిచెత్తను మాత్రమే ఇవ్వాలి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో ఇంటింటికి వచ్చి చెత్త సేకరణ చేసే ఆటోలకు ప్రతిరోజు తడిచెత్తను మాత్రమే ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తడి, పొడి చెత్తను రెండింటిని ఒకేసారి ఇస్తుండటంతో వాటిని వేరుచేసేందుకు కొంత ఇబ్బందులు ఉన్నా.. వేరే చేస్తున్నామని తెలిపారు. ప్రతి శుక్రవారం మాత్రమే ఇకనుంచి పొడిచెత్తను పారిశుద్ధ్య సిబ్బంది సేకరిస్తారని తెలియజేశారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ

ఉప్పునుంతల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నర్సరీలు, కంటి వెలుగు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు తదితర అంశాలపై ఎంపీడీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ తీసుకుంటేనే ఆశించిన ఎదుగుల ఉంటుందని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నాగర్‌కర్నూల్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అచ్చంపేట రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పార్వతమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని సిబ్బందికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, పింఛన్ సౌకర్యం, పండుగ బోనస్‌లు, ఇతర సౌకర్యాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో విమలమ్మ, పద్మ, సరోజ, రాజమ్మ, లక్ష్మి, కళమ్మ పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: రాబోయే బడ్జెట్ సమావేశంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 1 నుంచి 3 వరకు సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. మాసమ్మ, జయమ్మ, పుష్పలీల, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో..

రూ.26 వేల వేతనం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా శిశు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న 70 వేల మంది అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు మాట్లాడారు. అంగన్‌వాడీ వ్యవస్థలో పనిచేస్తున్న టీచర్‌లకు పెన్షన్ సౌకర్యం కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్య, అశోక్, రజియా, సుచిత్ర, అక్బర్, ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు ర్యాలీగా ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, అంగన్‌వాడీ వర్కర్లు నీరజ, లక్ష్మి, అలివేల, వెంకటమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపంలో వాస్తుపూజ



పూజ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి దంపతులు

కందనూలు: ఏంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చే నెల 12న నిర్వహిస్తున్న సామూహిక వివాహాల కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో సామూహిక వివాహాల మహోత్సవ ఏర్పాట్లు, కల్యాణ మండపం కోసం ఎంజేఆర్ ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, జమున దంపతులు వాస్తు పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 12న వేదపండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివాహాల అనంతరం వధువు, వరులకు కావాల్సిన అన్ని రకాల సామగ్రిని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. డీసీసీబీ డైరెక్టర్ జక్క రఘునందన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



తాడూరు యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 28 శనివారం నుంచి రెండు రోజులపాటు శ్రీ అలమేలు మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ వారు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు కల్పించారు.

నేడు అయ్యప్ప ఆలయంలో..

లింగాల: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం సన్నిధానంలో వార్షిక పూజల్లో భాగంగా శనివారం పడిపూజ నిర్వహించనున్నట్లు గురుస్వామి రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సూర్య దేవాలయంలో..

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో శుక్రవారం సూర్యనారాయణస్వామి 4వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా హోమం, ఊరేగింపు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే ఉత్సవ విగ్రహ ఊరేగింపు, సూర్యాదిత్య పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా ఆనందగిరి వెంకన్న కల్యాణం

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆనందగిరి స్వామి దేవస్థానంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కల్యాణోత్సవంలో అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ, ఏఈఓ

లింగాల: యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని అంబట్‌పల్లి శివారులో సాగు చేసిన వేరుశనగ పంటను శుక్రవారం ఏఓ పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం పంటకు కాయకుళ్లు తెగులు ఉన్నందున తగు మందులను వాడాలని అవగాహన కల్పించారు. కాయకుళ్లు, కాండం కుళ్లు, వేరు కుళ్లు తెగుళ్ల సోకే అవకాశాలు చాలా ఉంటాయని తెలిపారు. ఆయా తెగుళ్ల నివారణకు కార్బండిజం మరియు మాంకోజెట్‌ను 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శివానంద్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన శివప్రసాద్, ఆనంద్ గురువారం రాత్రి 10 గంటల సమయంలో మండల పరిధిలోని లక్నారానికి వెళ్తున్నారు. తాడూరు మండలం మేడిపూర్‌కి చెందిన కారు లింగాల వైపు నుంచి తెలకపల్లికి వస్తూ.. గౌరెడ్డిపల్లి, గోలగుండం గ్రామాల మధ్యన ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో శివప్రసాద్, ఆనందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

బాధితురాలికి ఆర్థికసాయం

అచ్చంపేట రూరల్: మండలంలోని మన్నెవారిపల్లిలో ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు కాలిపోయి నిరాశ్రయురాలైన బాధితురాలు నీల లక్ష్మమ్మకు శుక్రవారం గ్రామానికి చెందిన రాహుల్‌రెడ్డి తక్షణంగా రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. గురునాయక్, సిద్ధయ్య, రమేష్, రాజు పాల్గొన్నారు.

9 రకాల నిత్యావసర సరుకులు..

వెల్దండ: మండల పరిధిలోని కొట్రకి చెందిన ముంగలిశెట్టి జంగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. 25 కిలోల బియ్యంతో పాటు 9 రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. పొనుగోటి రవీందర్‌రావు, నాగరాజుగౌడ్, కొండల్‌రావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో



మాట్లాడుతున్న బల్మూర్ ఎస్‌ఐ శివానందంగౌడ్

లింగాల: మండలానికి ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్‌ఐ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. కాంగ్రెస్ మండల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఎస్‌ఐ అధికార పార్టీ ఏజెంట్‌గా మారి కాంగ్రెస్ పార్టీ వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ.. భయాందోళనకు గురిచేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ ఆరోపించారు. 26న మండలంలోని సూరాపూర్‌కు చెందిన శివరాజు శాయిన్‌పేటలో ఓ ఫంక్షన్‌లో ఫిల్టర్ వాటర్ పోయడానికి వెళ్లాడని, అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తి వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న భాస్కర్‌గౌడ్ శివరాజుపై దాడి చేసి ఆటో అద్దాలు పగులగొట్టాడని తెలిపారు. భాస్కర్‌రెడ్డి ఫోన్ చేయడంతో ఎస్‌ఐ ఎలాంటి విచారణ జరుపకుండా ఆటోను స్టేషన్‌లో పెట్టి శివరాజు తండ్రి నిరంజన్‌ను కొట్టారని తెలిపారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై దాదాపు 3 గంటల పాటు నిరసన తెలిపారు. బల్మూర్ ఎస్‌ఐ శివానందంగౌడ్ ఆందోళన విరమింప జేసే ప్రయత్నాలు ఫలించాయి. కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదును పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని తెలుపడంతో ఆందోళన విరమించారు. కొండల్‌రావు, మల్లయ్య, శ్రీశైలం, బుడ్డయ్య, జ్ఞానేశ్వర్‌రెడ్డి, తిరుపతయ్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



ఐక్యవేదికలో మాట్లాడుతున్న నాయకులు

వెల్దండ: పార్టీలకు అతీతంగా మాదిగలందరూ ఏకమై తమ హక్కులను సాధించుకోవాలని మాదిగ ఐక్య వేదిక నాయకులు నక్కెరకంటి శ్రీనివాస్, దార్ల కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సామాజికంగా చైతన్య పరిజ్ఞానం కలిగిన మాదిగలు నేడు ఆర్థిక, రాజకీయ, విద్యా, వైద్య రిజర్వేషన్లలో వెనుకబడి పోతున్నామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మాదిగలందరూ ఐక్యంగా ఉండి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మాదిగల ఐక్య వేదిక నాయకులు ప్రభాకర్, జంగయ్య, సోమయ్య, శేఖర్, యాదగిరి, రాజు, పుల్లయ్య, అంజయ్య, బాల్‌లక్ష్మయ్య, శశి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించండి



అచ్చంపేట రూరల్: ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అచ్చంపేట ఆర్టీసీ డీఎం రాజశేఖర్ కోరారు. శుక్రవారం అచ్చంపేట ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్, కండక్టర్లు, ఇతర సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ పీటీ కుమార్ కోయ దొర వేషధారణలో ఆకట్టుకున్నారు. డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, ప్రయాణికుల సౌకర్యార్థం సేవలు అందించాలని కోరారు. ఆర్టీసీ సంస్థను లాభాల బాటలో నడిపించాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు బాబునాయక్, చంద్రయ్య, జేఆర్‌రెడ్డి పాల్గొన్నారు.

'దళితబంధు' అమలు చేయాలని ధర్నా

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం ఎమ్మెల్యేలు పంచే పలహారంగా మారిందని, ఇప్పటికైన రాజకీయ ప్రమేయం లేకుండా దళితబంధు అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి అందజేశారు. దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని, దళితబంధుకు కేటాయించిన నిధులతో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, పర్వతాలు, హనుమంతు, జగన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం బహుమతి అందజేశారు. విద్యార్థులకు క్విజ్ వివిధ రకాల పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి అందించారు. క్లబ్ అధ్యక్షుడు డా.వెంకటేష్, నిరంజన్, ఆనంద్, పావని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'



శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకటేష్

కల్వకుర్తి రూరల్: కంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారి సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సిబ్బంది కంటి వెలుగు కార్యక్రమంలో శుక్రవారం 354 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 58 మందికి కంటి అద్దాలు అందించినట్లు కంటి వైద్య సహాయకుడు వెంకటేష్ చెప్పారు.

సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెండో విడత ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అంజయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బండోనిపల్లిలో కంటి వెలుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదలందరికి కంటిచూపు అందించడానికి కంటివెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు గుంతకోడూరులో శుక్రవారం 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డా సంతోష్‌అభిరాం తెలిపారు. సర్పంచ్ యాదమ్మ, వైద్య సిబ్బంది శ్రీనివాసులు, దాసు, సునిత, కళావతి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొల్లాపూర్: సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కుడికిల్లకి చెందిన రత్నయ్యకు రూ.1.50 లక్షలు, అంకిరావుపల్లికి చెందిన రాంచందర్‌కు రూ.60 వేలు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరయ్యాయి. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ అందజేత

వెల్దండ: మండల పరిధిలోని కుందారంతండా ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం మల్లేష్ అనే వ్యక్తి మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, మైక్‌సెట్ అందజేశారు. సర్పంచ్ కవిత, ఎస్ఎంసీ చైర్మన్ పత్యానాయక్, హెచ్ఎం నాగయ్య, నాగభూషణం, శ్రీను, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని బెక్కెర ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు అందించిన క్రీడా దుస్తులను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నరేష్ తదితరులు రూ.15 వేలతో 35 మంది విద్యార్థులకు దుస్తులు సమకూర్చారు. హెచ్ఎం రఘురామారావు, ఉపాధ్యాయురాలు అంజలి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తి రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో సహాయ కార్మిక అధికారి మహేందర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. కార్మికులందరికీ మోటారు సైకిళ్లు అందించాలన్నారు. ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీ మేరకు కార్మిక వెల్ఫేర్ బోర్డు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంజనేయులు, బాలమల్లయ్య, రాజు, కిశోర్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన

తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాలలో హెచ్ఎంగా వైష్ణవి, ఎంఈఓగా సాయిచరణ్ విధులు నిర్వహించగా 15 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్ఎం కట్ట శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌సాగర్, ఆసియాసుల్తానా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌ఓపై అవగాహన



కందనూలు: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో నిధి ఆప్ కే నికట్ 2.0 జిల్లా అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించడంతో పాటుగా పీఎఫ్ చందాదారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, సేవలను వివరించారు. పీఎఫ్ చందాదారులు, పెన్షనర్లు పాల్గొన్నారు. జి.వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



చెంచులతో సమావేశమైన పోషణ్ అభియాన్ టీం సభ్యులు

మన్ననూర్: లోతట్టు అటవీ ప్రాంతంలోని చెంచుపెంటల్లో నిర్వహణలో ఉన్న అంగన్‌డీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం వాటి విలువల గురించి తెలియజేశామని పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ విజ్ఞాన్ తెలిపారు. శుక్రవారం పుల్లాయిపల్లి, మల్లాపూర్, అప్పాపూర్, భౌరాపూర్, సంఫిడిగుండాలు, మేడిమల్కల, పెంటలను పోషణ్ అభియాన్ టీం సభ్యులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం గిరిపోషణ ఆహారాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. పెంటల్లో ఉన్న చాలా మంది మహిళలు, పిల్లలు రక్తహీనత, చర్మవ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ఇది ఇలా ఉండగా.. లోపల ఉన్న కొన్ని పెంటలకు తాగునీటికి ఇబ్బందిగా ఉందని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. టీం సభ్యులు శంకర్, గిరిజ, పార్వతమ్మ, బీపాష పాల్గొన్నారు.

విద్యార్థులకు అంబలి పంపిణీ



బిజినేపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి జగ్గారెడ్డి ఆధ్వర్యంలో బెల్లంతో కూడిన రాగి అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, హరిత, సురేశ్, పాఠశాల హెచ్ఎం ఎం.రాములు నాయక్ విద్యార్థులకు రాగి అంబలిని పంపిణీ చేసి మాట్లాడారు. బెల్లం, ఆర్గానిక్ రాగులతో చేసిన అంబలి విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అంబలి పంపిణీ ఇకపై ప్రతి రోజూ కొనసాగుతుందని తెలిపారు.

పశువైద్య శిబిరం

తాడూరు: మండలంలోని అల్లాపూర్‌లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డా రాజేష్‌కుమార్ మాట్లాడారు. పశువుల్లో సీజనల్‌గా వచ్చే రోగాల నివారణకు పశువైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు.

పర్యావరణ సెమినార్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్

కొల్లాపూర్: ఓజోన్ పొర పరిరక్షణ అంశంపై తెలంగాణ పొల్యూషన్, కంట్రోల్ బోర్డు, పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. ఇటీవల ఈ కార్యక్రమం నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో బీఎస్సీ సైన్స్ ఫైనల్ ఇయర్‌కు చెందిన అనూష మొదటి బహుమతిని, సెకండియర్‌కు చెందిన శివశంకర్ రెండో బహుమతి, బీఎస్సీ మ్యాథ్స్‌కు చెందిన పరమేష్ మూడో బహుతి సాధించారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు కళాశాల ప్రిన్స్‌పాల్ డా కె మల్లేషం అభినందించారు. రమేష్ , శ్రీమతిబాయ్‌లను కూడా అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ రామరాజు యాదవ్, సోఫి ఉన్నారు.

కళాశాలకు స్థల పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం తహసీల్దార్ శ్రీనివాసులు సర్వేయర్ రాంబాబు జయశంకర్ విగ్రహం వెనుక కుందేళ్లబండ వద్ద ప్రభుత్వ స్థలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ స్థలాలను జిల్లా ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఆమోదం పొంది వెంటనే కళాశాల నిర్మాణం చేపట్టాలన్నారు.

అభిమానుల సంబరాలు

కొల్లాపూర్: పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ వద్ద సినీ హీరో బాలకృష్ణ అభిమానులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమా విజయవంతంగా నడుస్తున్నందుకుగాను వారు సంబరాలు చేపట్టారు. ఆర్. బాలప్ప, గున్‌రెడ్డిబ్రహ్మానందరెడ్డి, శేషయ్య, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.